
సాక్షి బాపట్ల

శనివారం । 27 । జూలై । 2024



బంగారపు బొట్లు సమర్పణ

శ్రీకాకుళం(ఘంటసాల): ఆంధ్ర మహావిష్ణువు శ్రీకాకుళేశ్వరస్వామికి తెనాలి మండలం చినరావూరుకి చెందిన వి.నిరంజన్‌రావు దంపతులు బంగారపు బొట్లు సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 916 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 200 క్యూసెక్కులు వదిలారు.

శాకంబరీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో భక్తులు అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఒలింపిక్స్‌కు ఎస్ఆర్ఎం విద్యార్థిని

400 మీటర్ల రిలే పరుగు పోటీకి జ్యోతికశ్రీ ఎంపిక



మంగళగిరి: ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌కు ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయం విద్యార్థిని దండి జ్యోతికశ్రీ ఎంపికైంది. 400 మీటర్ల రిలే పరుగుపందెంలో సత్తా చాటేందుకు ప్యారిస్ వెళ్లింది. అమరావతిలోని యూనివర్సిటీలో జ్యోతికశ్రీ ఇటీవలే ఫస్ట్ ఇయర్ బీఏ కోర్సులో ప్రవేశం పొందింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన ఆమె ఇప్పటికే అంతర్జాతీయ అథ్లెట్‌గా గుర్తింపు పొందింది. 2021 ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఇండియన్ నేషనల్ క్రీడా పోటీలలో ఉమెన్స్ (అండర్ – 23 కేటగిరి)పరుగు పందెంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అంతర్జాతీయ క్రీడా పోటీలలో పాల్గొని భారత్ జట్టు తరఫున అనేక పతకాలను పొందిన జ్యోతికశ్రీ ఒలింపిక్స్‌లోనూ సత్తాచాటుతుందని యూనివర్సిటీ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. జ్యోతికశ్రీని యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్ కుమార్ అరోరా, స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ ధీరజ్ పరాశర్లు అభినందించారు.

పల్నాడులో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం, కందిపప్పు

నరసరావుపేట: బహిరంగ మార్కెట్‌లో పెరిగిపోతున్న నిత్యావసరాల ధరల్ని నియంత్రించేందుకు జిల్లాలో ఎనిమిది ప్రదేశాల్లోని 22 ప్రత్యేక కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 3,386 మందికి 3,842 కిలోల కందిపప్పు, 1,077మందికి 15,694 కిలోల బీపీటీ బియ్యం విక్రయించినట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి ఎస్.పద్మశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం స్టీమ్డ్ ఫైన్ రకం బియ్యం కిలో రూ.55.85 ఉండగా రూ.49కు, రా రైస్ ముడి రకం బియ్యం కిలో రూ.52.40 ఉండగా రూ.48కు, దేశవాళీ కందిపప్పు రూ.174 ఉండగా రూ.160కు అందజేస్తున్నామని వివరించారు. ఏమైనా అవకతవకలు జరిగినట్లు భావిస్తే జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి 91549 59287 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు.

ప్రతి సభ్యురాలి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



ముప్పాళ్ల: గ్రామ సమాఖ్యలో ఉన్న ప్రతి సభ్యురాలి వివరాలను జాతీయ గ్రామీణ లైవ్లీవుడ్ మిషన్ సైట్‌లో నమోదు చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలునాయక్ చెప్పారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బాలునాయక్ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న ప్రతి సభ్యురాలి బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్‌కార్డుతో పాటు ఆర్థికపరమైన విషయాలన్నీ సంబంధిత యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండలంలో మొత్తం వెయ్యి గ్రూపులకుగాను ఇంకా 296 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీఎం శ్రీనివాసరావు, లీగల్ కోఆర్డినేటర్ కనకారావు, ఏపీఎం బాలస్వామి, సీసీలు నాగరాజు, ఆయా గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

ఉద్యాన సహాయకుల కార్యవర్గం ఎన్నిక



గిద్దల ఆంజనేయులు
అధ్యక్షుడు



వేము ఏసురత్నం
ప్రధాన కార్యదర్శి

నరసరావుపేటరూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లా ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులుగా గిద్దల ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా చింత గోపీనాథ్ యాదవ్, ప్రధానకార్యదర్శిగా వేము ఏసురత్నం, సంయుక్త కార్యదర్శిగా జంపాల ప్రసాద్, కోశాధికారిగా వినయ్‌కుమార్, ఉమెన్ వెల్ఫేర్ కార్యదర్శిగా కరుణకుమారిలను ఎన్నుకున్నారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా సంఘం పనిచేస్తుందని కార్యవర్గ సభ్యులు తెలిపారు. సంఘం సభ్యులుగా కలగోట్ల రామకోటిరెడ్డి, గాలం యథేంద్ర నాగరాజు, మువ్వా గురునాథం, చింతలపూడి రాజేశ్వరి నియమితులయ్యారు.

హర్రర్..టెర్రర్



- నేరాలకు అడ్డాగా చీరాల
- ప్రజల ప్రాణాలకు రక్షణ కరువు
- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న పోలీసులు
- నెలన్నరలో ఒక గ్యాంగ్ రేప్, రెండు హత్యలు, పలు హత్యాయత్నాలు
- భయాందోళనలో ప్రజలు

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రశాంత చీరాల ముఖ చిత్రం మారిపోయింది. నేరాలకు అడ్డాగా మారింది. బ్రాండ్ నేమ్ అమాంతం పడిపోయింది. అటు పర్యాటకం దెబ్బతింది. నేరాల్ని పోలీసులు అదుపులో పెట్టలేకపోవడంతో పట్టణం మొత్తం కకావికలమైంది. ప్రజల్లో భయాందోళన పెరిగిపోయింది. వరుస హత్యలతో భీతిల్లుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. శాంతిభద్రతల్ని కాపాడాల్సిన పోలీసులు మాత్రం ప్రేక్షకపాత్ర పోషించి, హడావుడి చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. బాపట్ల జిల్లాలోని చీరాలలో ఇటీవల జరిగిన వరుస ఘాతుకాలు హర్రర్ సినిమాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉన్నాయి. నెలన్నరలోనే రెండు హత్యలు, ఓ యువతి గ్యాంగ్‌రేప్, ఆపై హత్య చేసిన ఘటన పట్టణ ప్రజల్ని నివ్వెరపోయేలా చేసింది.

– చీరాల



చీరాల పట్టణ వ్యూ

సంచలనం రేపిన గ్యాంగ్ రేప్



సుచరిత (ఫైల్)

చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలోని సీతారామపురానికి చెందిన పి.వెంకటేశ్వర్లు, కామాక్షి దంపతులు నెల్లూరు జిల్లా గూడూరు నుంచి కొన్ని సంవత్సరాల కిందట ఈపూరుపాలెం వచ్చారు. చేనేత మగ్గం పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె సుచరిత ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. గత రెండేళ్లుగా ఇంటి వద్దనే టైలరింగ్ పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలిచింది. గతనెల 21 తేదీ ఉదయం 5.30 గంటల సమయంలో ఇంటి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద బహిర్భూమికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో అనుమానంతో తండ్రి వెంకటేశ్వర్లు అక్కడకు వెళ్లగా శరీరంపై దుస్తులు లేకుండా నిర్జీవంగా పడి ఉన్న కుమార్తెను ఒక్కసారిగా చూసి భీతిల్లిపోయాడు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. అదే ప్రాంతంలో కొంత మంది యువకులు మద్యం తాగుతుంటారని, బహిర్భూమికి వెళ్లే మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తుంటారని స్థానికులు తెలిపారు. దీంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేశారు. గంజాయి బ్యాచ్ పనేనని నిర్ధారించి అదుపులోకి తీసుకుని విచారించారు. మత్తు పదార్థాలు తీసుకుని జులాయిలుగా తిరిగే యువకులు సుచరితను గ్యాంగ్‌రేప్ చేసి హత్య చేసినట్లు ఒప్పుకున్నారు.

హత్యతో ఉలిక్కిపడిన ప్రజలు



హత్యకు గురైన క్యాటరింగ్ వ్యాపారి సంతోష్ (ఫైల్)

క్షణికావేశానికి గురైె చిన్న ఘటనకే ఓ పండ్ల వ్యాపారి కోపంతో క్యాటరింగ్ షాప్ నిర్వాహకుడిని కత్తితో దాడి చేసి హత్య చేసిన ఘటన గత నెల 23న చీరాల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన కంచర్ల సంతోష్ (36) సంగం థియేటర్ సమీపంలో ఖానా ఖజానా పేరిట కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. దీనికి ఎదురుగా రోడ్డుపై చిరు వ్యాపారులు వివిధ రకాల పండ్లు అమ్మకాలు చేస్తుంటారు. ఉదయం 11 గంటల సమయంలో నాని అనే పండ్ల వ్యాపారి తాగునీటిని క్యానులో నింపుకునే క్రమంలో చిన్న గొడవ మొదలైంది. క్యాన్‌ను శుభ్రం చేసిన నీరు ఎదురుగా ఉన్న ఖానా ఖజానా దుకాణం వద్దకు చేరింది. దీనిపై కర్రీ పాయింట్‌లో పనిచేసే మహిళలు పండ్ల వ్యాపారిని ప్రశ్నించడంతో వారిపై వాగ్వివాదానికి దిగాడు. విషయాన్ని ఆ మహిళలు కర్రీ పాయింట్ యాజమాని అయిన సంతోష్‌కు సమాచారం అందించారు. అతడు వచ్చి పండ్ల వ్యాపారి నానీని ప్రశ్నించడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. తనవద్ద పనిచేసే కూలీ ఉమామహేశ్వరావుతో కలిసి పండ్లు కోసే కత్తితో సంతోష్‌పై దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావానికి గురైన అతడ్ని స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సంతోష్ మృతిచెందాడు.

భయం గుప్పెట్లో ఈపురుపాలెం



హత్యకు గురైన లలితమ్మ (ఫైల్)

ఈ నెల 23న రాత్రి జరిగిన రిటైర్డ్ ఉపాధ్యాయురాల దారుణ హత్య పట్టణంలో క్షీణించిన శాంతి భద్రతలకు అద్దం పడుతోంది. ఈపురుపాలెం జెండాచెట్టు వద్ద బాలుర ఉన్నతపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పిల్లి లలితమ్మ (75) నివాసం ఉంటోంది. కుమారులు ఇద్దరు అమెరికాలో స్థిరపడగా, కూతురు విజయవాడలో నివాసం ఉంటోంది. పదేళ్ల కిందట భర్త మరణించడంతో ఒంటరిగానే జెండా చెట్టు వీధిలోని స్వగృహంలో ఉంటుంది. రాత్రి 10 గంటల సమయంలో నిద్రపోతున్న ఆమెను దుండగులు గొంతు వద్ద కత్తితో పొడిచి హతమార్చారు. నగదు, నగలు అపహరించుకు పోయారు. కొంతకాలంగా ఈపురుపాలెంలో గంజాయి బ్యాచ్ స్వైర విహారాలు చేస్తోంది. ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రోజు ఇంటికి వచ్చే వాళ్లల్లో బంగారం, నగదుకు ఆశపడి నమ్మకంగా హత్య చేసి ఉండచ్చనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు.

పోస్టింగుల కోసం పాకులాడుతున్న పోలీసులు

గతంలో పోలీసులపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉండేది. నిత్యం అందుబాటులో ఉండేవారు. ఏ ఆపద వచ్చినా వెంటనే న్యాయం చేసేవారు. ప్రస్తుతం పనితీరు పేలవంగా ఉంది. అధికార పార్టీ నాయకుల సేవలకు, తమ పోస్టింగ్‌ల కోసం పాకులాడుతున్నారే గానీ స్టేషన్లలో అందుబాటులో ఉండటం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచకపోవడం, అసాంఘిక కార్యకలాపాలు చేసే వారిని అడ్డుకోవడం ఎప్పుడో మరిచిపోయారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. గంజాయి దొరికే ప్రాంతం, అమ్మకాలు చేసే వారెవరో తెలిసినా పట్టించుకోకపోవడంతో ఆగడాలు పెరిగిపోతున్నాయని విమర్శిస్తున్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు వేళాయె..

- నేటి నుంచి ఏపీ ఐసెట్–2024 కౌన్సెలింగ్
- ఆగస్టు 1వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్
- ఆగస్టు 3 వరకు ధ్రువపత్రాల పరిశీలన
- పూర్తిగా ఆన్‌లైన్‌లోనే పరిశీలన ప్రక్రియ
- ఆగస్టు 4 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు
- ఆగస్టు 10న కళాశాలల్లో సీట్ల కేటాయింపు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన ఏపీ ఐసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారం ప్రారంభం కానుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా ఆగస్టు ఒకటో తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ రిజిస్ట్రేషన్ జరగనుంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారం నుంచి ఆగస్టు 3 వరకు జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఏపీ ఐసెట్–2024 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసింది.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపుతో ప్రక్రియ మొదలు

ఏపీ ఐసెట్–2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు శనివారం నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందు కోసం ఏపీ ఐసెట్ హాల్ టికెట్ నంబరు, ర్యాంకు కార్డు వివరాలతో ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి.



విద్యార్థులు (ఫైల్)

- ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చొప్పున ప్రాసెసింగ్ ఫీజును తిరిగి ఇదే వెబ్‌సైట్‌లో క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డు, నెట్ బ్యాంకింగ్ మార్గాల్లో చెల్లించాలి. ఏపీ ఐసెట్ డీటైల్డ్ నోటిఫికేషన్, యూజర్ మాన్యువల్, కళాశాలల జాబితా, విద్యార్థులకు మార్గదర్శకాలను ఇదే సైట్‌లో పొందుపర్చారు.
- విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరగనుంది. రిజిస్ట్రేషన్ అనంతరం శనివారం నుంచి ఇది ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే పీహెచ్, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఆంగ్లో ఇండియన్ కేటగిరీలకు చెందిన విద్యార్థుల ధ్రువపత్రాలను విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో భౌతికంగా పరిశీలిస్తారు.

ఆగస్టు 7వరకు వెబ్ ఆప్షన్లు

ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆగస్టు 4,5,6,7వ తేదీల్లో వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంది. ప్రైవేటు ఇంటర్నెట్ కేంద్రాలతో పాటు ఇంట్లో నుంచే కంప్యూటర్ ద్వారా ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లోనూ ఆప్షన్ల నమోదుకు యాజమాన్యాలు సహాయ, సహకారాలు అందించనున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ఆప్షన్లను తిరిగి మార్చుకునేందుకు ఆగస్టు 8న తుది అవకాశం ఉండగా, ఆగస్టు 10న సీట్ల కేటాయింపు జరగనుంది. గుంటూరు జిల్లాలో ఏఎన్‌యూతో పాటు ప్రైవేటు ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలు 10 వరకు ఉన్నాయి. ఆయా కళాశాలల సామర్థ్యానికి అనుగుణంగా ఇన్‌టేక్‌లో 60, 120 చొప్పున ఎంబీఏ, ఎంసీఏ సీట్లు ఉన్నాయి.

సీఆర్‌జెడ్‌తో తీర ప్రాంత అభివృద్ధి

కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: సీఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యులేషన్ జోన్)తో తీర ప్రాంతాలు, దాని ప్రాదేశిక నీటి పరిమితి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి చెప్పారు. సీఆర్‌జెడ్–2019 నోటిఫికేషన్ అమలుకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూనే తీర ప్రాంతాలు అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన మడ అడవులు, వాగులు, ఇసుక దిన్నెలు మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తూ, వారి సంరక్షణకు ఎంతో ఉపయోగంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. తరతరాలుగా సముద్రంలోని మత్స్య సంపదపై వారు ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. ప్రకృతిని దెబ్బతీయకుండానే అభివృద్ధి చేస్తూ భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. సముద్ర తీర ప్రాంతం బాపట్ల జిల్లాలో 74 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉందని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. 492 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ ఏర్పాటు కానుందని వెల్లడించారు. దీని వల్ల జిల్లా ప్రజలకు కలిగే ప్రయోజనం, చేపట్టే అభివృద్ధి అంశాలపై చర్చించారు. పర్యాటక రంగంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పర్యాటకులు, సందర్శకులు విరివిగా రావడానికి సీఆర్‌జెడ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్నానాలు చేయడం, దుస్తులు మార్చుకోవడానికి, విశ్రాంతి పొందడానికి గదులు, రిసార్ట్స్ వస్తాయని చెప్పారు. పలు రకాల అభివృద్ధి కార్యక్రమాలు జోన్ పరిధిలోకి వస్తాయన్నారు. అభివృద్ధి జరగాలంటే ప్రకృతిని కొంత విలువగా చెల్లించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వివరించారు. సీఆర్‌జెడ్‌లో అభివృద్ధి లేని ప్రాంతాల విస్తీర్ణం కుదించాలని రిసార్ట్స్ యజమానులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పలు గ్రామాల ప్రజలు కోరారు. తీర ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పలు సమస్యల్ని అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, పలు శాఖల అధికారులు కె. సౌందర్‌రాజన్, ఆర్. సమనిధి, మీరా, షేక్ సుభాని పాల్గొన్నారు.

పర్వతారోహణలో 23 ఆంధ్రా బెటాలియన్ సత్తా

- 3200 అడుగులు ఎత్తును అధిరోహించిన విద్యార్థులు
- అభినందించిన గుంటూరు గ్రూపు కమాండర్ చంద్రశేఖర్

చీరాల టౌన్: పర్వతారోహణలో 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ చాటారు. ఎన్‌సీసీతో ఉజ్వల భవిత సాధించడంతో పాటుగా పర్వతారోహణ చేసి గుంటూరు గ్రూపునకు పేరు తీసుకొచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్లు సుశ్వంత్, ఆర్తిలు ఇతర క్యాడెట్లకు మార్గదర్శకులని కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ ప్రశంసించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో దిబాంగ్‌లో మే 25 నుంచి జూన్ 25 వరకు ట్రెక్కింగ్, పర్వతారోహణ క్యాంప్ నిర్వహించారు. ఇందులో గోరిచెన్ గ్లేసియర్ మంచు పర్వతం 3200 అడుగులు ఎత్తును అధిరోహించి రికార్డు సృష్టించిన నరసరావుపేట, చీరాల ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు సుశ్వంత్, ఆర్తిలను శుక్రవారం ఎన్‌సీసీ కార్యాలయంలో గ్రూపు కమాండర్ ధ్రువీకరణ పత్రాల్ని అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా నాయకత్వ లక్షణాలు, శారీరక ధృఢత్వం, ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ఎన్‌సీసీ సీ సర్టిఫికేట్‌తో త్రివిధ దళాలల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని చెప్పారు. పతకాలు సాధించిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఆర్తి, సుశ్వంత్ మాట్లాడుతూ భవిష్యత్‌లో త్రివిధ దళాల్లో ఉద్యోగం సాధించి దేశ సేవలో పాలు పంచుకుంటామని తెలిపారు.



అరుణాచల్‌ప్రదేశ్‌లో పర్వతంపై ఎన్‌సీసీ జెండా ఆవిష్కరిస్తున్న క్యాడెట్లు ఆర్తి, సుశ్వంత్



గుంటూరు గ్రూపు కమాండర్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న క్యాడెట్లు

ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో నమోదుతో పలు ఉపయోగాలు

విజయవాడ ప్రాంతీయ సంచాలకులు రవిశంకర్

చీరాల రూరల్: విద్యార్థులంతా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేర్లు నమోదు చేసుకుని ఉద్యోగాలు సాధించాలని దత్తోపంత్ ఠేంగడి జాతీయ కార్మిక విద్యా, అభివృద్ధి సంస్థ విజయవాడ ప్రాంతీయ సంచాలకులు ఆర్. రవిశంకర్ తెలిపారు. భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖలో విభాగమైన దత్తోపంత్ ఠేంగడి జాతీయ కార్మిక సంస్థ విజయవాడ ప్రాంతీయ కార్యాలయం సౌజన్యంతో ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ చీరాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవిశంకర్ పాల్గొని విద్యార్థుల్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. నేషనల్ కెరీర్ సర్వీసెస్ అయిన ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేర్ల నమోదుతో ప్రభుత్వ పథకాలు, ఉద్యోగావకాశాలు పొందవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ముట్టె వెంకటేశ్వర్లు (ఎంపీ), ఇంటిగ్రేటెడ్ పీపుల్స్ డవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌డీ మతిన్, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న రవిశంకర్

గుర్రపు డెక్క, తూటి కాడల తొలగింపు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్

రేపల్లె రూరల్: డ్రెయిన్లలో పూడి కతీతలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 20న సాక్షి దినపత్రికలో 'అగ్రి గండంలో అన్నదాత' పేరుతో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సొంత ఖర్చులతో వాడ మురుగు డ్రెయిన్‌లో తూటి కాడ, గుర్రపు డెక్కను తొలగించేందుకు పొక్లెయిన్ ఏర్పాటు చేశారు. త్వరితగతిన తొలగించాలని సిబ్బందికి సూచించారు. పేటేరు అడ్డరోడ్డు నుంచి బేతపూడి వరకు ఉన్న డ్రెయిన్‌లో పూడికతీత పనుల్ని ఆయన సోదరుడు అనగాని శివప్రసాద్ పర్యవేక్షించారు.


వాడ మురుగు డ్రెయిన్‌లో తొలగింపు

కోనంకిలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

- మూడు బైకులు, సోడా బండి దగ్ధం
- ఈ సమయంలో స్కూటీ, సెల్‌ఫోన్ చోరీ

మార్టూరు: అగ్ని ప్రమాదంలో మూడు బైకులు, సోడా బండి దగ్ధం కాగా అదే పరిసరాల్లో మరో స్కూటీ, సెల్ ఫోన్ చోరీకి గురయ్యాయి. ఈ ఘటనలు గురువారం అర్ధరాత్రి మండలంలోని కోనంగిలో జరిగాయి. సీఐ ఎస్వీ రాజశేఖర్ రెడ్డి వివరాల మేరకు.. కోనంకి గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి వేసవిలో స్థానికంగా సోడాలు విక్రయిస్తూ సీజన్‌లో కర్ణాటకలో వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇటీవల అక్కడకు వెళ్తూ బైకుతో పాటు సోడా బండిని ఇంటి వరండాలో ఉంచి వెళ్లాడు. అక్కడే ఇరుగుపొరుగు వారు రెండు బైకుల్ని కూడా గురువారం రాత్రి నిలిపారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఖాజావలి ఇంటి నుంచి వస్తున్న మంటల్ని గమనించిన స్థానికులు పెద్ద కుమారుడు మస్తాన్‌వలికి సమాచారం అందించారు. అతడు, స్థానికులు కలసి మంటల్ని అదుపులోకి తెచ్చారు. అప్పటికే వరండాలో ఉన్న మూడు బైకులు పూర్తిగా దగ్ధం కాగా, సోడా బండి పాక్షికంగా కాలిపోయింది. విద్యుత్ మీటరు పూర్తిగా కాలిపోయింది. తర్వాత కిటికీ నుంచి ఇంటి లోపలికి మంటలు వ్యాపించి బీరువాతో పాటు కొన్ని దుస్తులు సైతం కాలిపోయాయి.


అగ్ని ప్రమాదాన్ని పరిశీలిస్తున్న సీఐ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి

స్కూటీ దొంగిలించి బైక్‌లను దగ్ధం చేశారా..?

ఇదిలా ఉండగా ఖాజావలి ఇంటి సమీపంలో తమ్ముడి కుమారుడు ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీతోపాటు సెల్‌ఫోన్ సైతం అపహరణకు గురైనట్లు ఆలస్యంగా గుర్తించారు. వీటిని చోరీ చేసిన అగంతకులే పార్కు చేసి ఉన్న బైకుల్ని దగ్ధం చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం బాపట్ల నుంచి వచ్చిన క్లూస్ టీం బృందం ఆధారాల్ని సేకరించింది. సీఐ ఘటనా స్థలికి వెళ్లి అగ్ని ప్రమాదం తీరును పరిశీలించారు. మస్తాన్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

29న కలెక్టరేట్ల వద్ద చేనేతల ఆందోళన, నిరసన

భట్టిప్రోలు: చేనేత కార్మికుల సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి. బాలాజీ తెలిపారు. భట్టిప్రోలులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చేనేత సొసైటీలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించకపోవడంతో కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించలేని దుస్థితి నెలకొందని చెప్పారు. సొసైటీలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 6 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. నేతన్న నేస్తాన్ని రూ. 24 నుంచి రూ. 36 వేలకు పెంచి మగ్గం నేసే ప్రతి కార్మికుడికీ, ఉప వృత్తి చేస్తున్న వారికి కూడా పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు కె. రామకోటేశ్వరరావు, చేనేత సంఘ నేతలు కె. వీరమోహన్‌రావు, డి. రామారావు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృత్తి బోధన.. ప్రవృత్తి రచన

- పురస్కారాలు అందుకుంటున్న రచయిత్రి గంగవరపు సునీత
- బాల్యదశ నుంచే తెలుగు భాషపై పట్టు
- తొమ్మిదో తరగతిలో రాసిన మొదటి వ్యాసానికే ప్రశంసలు
- 'మౌనమేలనోయి'తో రెండున్నర దశాబ్దాల క్రితమే రచయితగా గుర్తింపు
- సుమారు వెయ్యికి పైగా కవితలు, కథలు రచన
- రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులతో పాటు ప్రశంసలు

బల్లికురవ: చిన్నప్పటి నుంచి ఆమెకు తెలుగంటే ప్రాణం. భాష మీద ప్రేమ ఆమెతో పాటు పెరిగింది. సుమారు వేయి పైచిలుకు కవితలు, కథలు రచించేలా చేసింది. అటు ఉపాధ్యాయురాలిగా, ఇటు రచయిత్రిగా ద్విపాత్రాభినయం చేస్తూ ఈ తరం యువతకు ఆదర్శనీయురాలిగా నిలుస్తోంది సునీత గంగవరపు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం దేవరాజుగట్టు గ్రామానికి చెందిన దివంగత గంగవరపు జోసఫ్, చలగాలి కృష్ణమ్మ విశాంత్ర ఉపాధ్యాయులు. వారి కుమార్తె సునీత ప్రాథమిక విద్యను మార్కాపురం బాలికోన్నత పాఠశాలలో, ఇంటర్మీడియేట్ నరసరావుపేట హర్ష జూనియర్ కళాశాలలో, బీఈడీ విజయవాడ సమీపంలోని కానూరు సిద్ధార్థ కళాశాలలో పూర్తి చేశారు. ఎంఏ, హిస్టరీ, సోషియాలజీ తెలుగుతో పాటు, పీజీడీసీజేను రచన జర్నలిజం కళాశాల హైదరాబాద్‌లో చేశారు.


ప్రొఫెసర్ ఎండ్లూరి సుధాకర్ స్మారక అవార్డు స్వీకరిస్తున్న సునీత

2009లో ఉపాధ్యాయురాలిగా ఎంపిక

2008 డీఎస్సీలో లాంగ్వేజ్ పండిట్ పోస్టుకు పరీక్ష రాశారు. 2009 అక్టోబరు 19న త్రిపురాంతకం మండలం సోమేపల్లి పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరారు. తర్వాత మార్టూరు పాఠశాలకు బదిలీపై వచ్చారు. 2019లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పదోన్నతులు కల్పించడంతో నవంబరులో దర్శి మండలం బండి వెలిగండ్ల స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. 2023 మేలో జరిగిన బదిలీల్లో బల్లికురవ ఉన్నత పాఠశాలకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త పాదిలి కుమార్ మార్టూరు మండలం నాగరాజుపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


రామచంద్రపురంలో ఐడియల్ టీచర్‌గా అవార్డు

తండ్రి ప్రోత్సాహంతో భాషపై ఇష్టం

తల్లి, తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉండటంతో పాటు తండ్రి జోసఫ్‌కు తెలుగు భాషపై పట్టు ఉండేది. పాఠశాలకు తెప్పించే చందమామ, బాలమిత్ర, బాలచంద్రికలను చదువుతూ 4వ తరగతి లోనే చిన్నచిన్న కవితలు, కథలు రాసి ఉపాధ్యాయులతో సునీత శభాష్ అనిపించుకున్నారు. 9వ తరగతిలో రాసిన మొదటి వ్యాసం ప్రశంసలు పొందింది. 2000లో ప్రచురితమైన మౌనమేలనోయి, శ్రీవారికి చివరిలేఖ తదితర కథలతో రచయితగా సునీత గుర్తింపు పొందారు. యువతులు, స్త్రీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని ఇతివృత్తంగా 'వెన్నెల చివుళ్లు' నవల, ప్రేమ భావోద్వేగాలు, సామాజిక అంశాలతో కవితలు రాశారు. వేయికి పైగా కథలు, కవితలు రాసినట్లు సునీత చెప్పారు.

అవార్డుల పంట

గత ఏడు సంవత్సరాలుగా రాష్ట్ర జాతీయస్థాయిలో అవార్డులు పాటు ప్రశంసలతో ఆయా పాఠశాలలకు పేరు ప్రఖ్యాతలు తెస్తున్నారు. 2018 ఒంగోలు కళామిత్ర మండలి రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం, 2019 మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాకళావేదిక ఒంగోలు వారి సత్కారం అందుకున్నారు. అదే ఏడాది వెన్నెల చివుళ్లు నవలకు 2022 ఆగస్టులో ఫిరంగిపురంలో బీఆర్ అంబేడ్కర్ జాతీయ పురస్కారం, అక్టోబర్ 2న తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో ఐడీఎల్ టీచింగ్ అవార్డు లభించింది. 2023 జనవరి 21న ప్రొఫెసర్ ఎండ్లూరి సుధాకర్ స్మారక అవార్డు, డిసెంబర్ 28న ఇందిరా ఆర్ట్ ఫౌండేషన్ హైదరాబాద్‌లో ప్రతిభా పురస్కారం, 2014 ఉగాదికి తెనాలి గుర్రం జాషువా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సాహిత్య భూషణ్ బిరుదుతో పురస్కారం దక్కింది. ఈ ఏడాది జూన్ 30న నెల్లూరులో 'మరో గబ్బిలం' పుస్తకానికి విశాలక్షి పురస్కారం లభించింది. పనిచేస్తున్న పాఠశాలలో సేవా కార్యక్రమాలతో పాటు గాయకురాలిగా పాటలు, పద్యాలు పాడటం వల్ల విద్యార్థుల మనస్సులో చెరగని ముద్ర వేసుకున్నారు సునీత.

సమసమాజ స్థాపనకు కృషిచేయాలి



మహనీయులు అంబేడ్కర్, గుర్రం జాషువా, జ్యోతిరావు పూలే కలలు కన్న సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. సామాజిక అసమానతల్ని రూపుమాపాలి. నా ఆకాంక్ష, ఆశలు, ఆశయాలను 'మరో గబ్బిలం' పుస్తకం ద్వారా ప్రజలకు తెలియజేశా.

– గంగవరపు సునీత, బల్లికురవ

ప్రత్యామ్నాయ పంటలే మేలు

జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

అద్దంకి: సాగు నీరు ప్రశ్నార్థకంగా ఉన్న సమయంలో వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న తదితర పంటల్ని సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై. రామకృష్ణ సూచించారు. ఆయన శుక్రవారం ఏడీఏ ధన్‌రాజ్, మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణతో కలిసి మండలంలోని శింగరకొండపాలెంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కజొన్న సాగుకు పెద్దగా నీటి అవసరం ఉండదని రైతులకు తెలిపారు. పంటను ప్రాథమిక దశలోనే కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ ధన్‌రాజ్ సూచించారు.


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచాలి

అడిషనల్ డీపీఎం మోహన్

మార్టూరు: ప్రకృతి సేద్యంపై రైతులతో పాటు ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అడిషనల్ డీపీఎం మోహన్ తెలిపారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో శుక్రవారం డ్వాక్రా గ్రూపులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని మహిళా సంఘాలు, గ్రూపుల ద్వారా బలోపేతం చేయాలని చెప్పారు. దిగుబడి అయ్యే వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం, ఏ విధంగా ఆరోగ్యకరమో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు తొలుత విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన, లాభసాటి ఉత్పత్తుల వల్ల కలిగే ప్రయోజనాల్ని తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారత్నం, చెన్నయ్య, కోటమ్మ ఎంటీఎస్ నీలం ప్రకాష్ కుమార్, శంకర్, రహీమున్, నాగరాజు పాల్గొన్నారు.

మెరుగ్గా యూటీఎస్ మొబైల్ యాప్


కొత్త కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

రైల్వే గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): యూటీఎస్ మొబైల్ యాప్‌ను మెరుగుపరిచి రైలు టికెట్ల కొనుగోలుకు దూర పరిమితిని సడలించామని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఇప్పుడు రైల్వే ప్రాంగణం నుంచి 5 మీటర్లకు మించిన దూరం నుంచీ టికెట్లు కొనొచ్చని వెల్లడించారు. యూటీఎస్ మొబైల్ యాప్ వినియోగం పెరుగుతుందని పేర్కొన్నారు. రైల్వే వాలెట్ ద్వారా రీచార్జ్‌పై 3 శాతం బోనస్ పొందవచ్చని తెలిపారు.

కార్గిల్ వీరులకు అంకితం

కొత్తగా ఏర్పాటుచేసిన ఆపరేటింగ్, సిగ్నల్ కంట్రోల్ రూమ్‌లను కార్గిల్ వీరులకు అంకితం చేస్తున్నామని గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. స్థానిక పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయ భవనంలో 3వ ఆపరేటింగ్ కంట్రోల్ బోర్డ్, సిగ్నల్ కంట్రోల్ రూమ్‌లను డీఆర్ఎం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మునుమాక-నంద్యాల, శావల్యాపురం-న్యూ విభాగాలతో కూడిన ఆపరేటింగ్ విభాగాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, సీనియర్ డీఓఎం దినేష్ కుమార్, సీనియర్ డివిజనల్ సిగ్నల్, టెలికమ్యూనికేటింగ్ ఇంజినీర్ బి.లక్ష్మణ్, సీనియర్ డీఈఎన్ కోఆర్డినేషన్ జె.వి.ఆనూషా తదితరులు పాల్గొన్నారు.

10వేల మొక్కలు నాటిన యూనియన్ బ్యాంకు

నరసరావుపేట: భారత ప్రభుత్వ మంత్రిత్వశాఖ ఆదేశాలతో ప్లాంట్ ఫోర్ మదర్ క్యాంపెయిన్‌లో భాగంగా నరసరావుపేట యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10వేల మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా పూర్తిచేసినట్లు ప్రాంతీయ అధికారి మాధురి చెప్పారు. స్థానిక పీఎన్సీ అండ్ కేఆర్ కళాశాలలో కళాశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ బొట్ల రఘుప్రసాదు, కళాశాల వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసప్రసాద్ హాజరయ్యారు. మాధురి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక రాయితీతో యూనియన్ ముస్కాన్ అకౌంట్లు, సుకన్య సమృద్ధి యోజన పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు సేవల్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు ఉప ప్రాంతీయ అధికారి మురళీమోహన్, వివిధ శాఖల మేనేజర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పీఎన్సీ అండ్ కేఆర్ కళాశాలలో మొక్కలు నాటిన మాధురి

ముఖ మండప నిర్మాణం పరిశీలన



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండ దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ టీటీడీ ట్రస్ట్ ద్వారా అందించిన నిధుల సద్వినియోగం, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు, కొలతలను పరిశీలించామన్నారు. అనంతరం రికార్డులు, ఫైళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎంఆర్‌వో వి.ఎస్.పాల్, డీవీ శేషయ్య, ఏవీ చిరంజీవి, ఏఈ దివ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన ఆర్జేడీ

చీరాల అర్బన్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్ని పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన ఈపూరుపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్, చీరాలలోని జేమ్స్ హైస్కూల్, ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌ను తనిఖీ చేశారు. తరగతి గదులు, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ప్రతిభా సామర్థ్యాల్ని తెలుసుకున్నారు. అనంతరం బోధనా నైపుణ్యాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో పి.సుబ్రమణ్యేశ్వరరావు ఉన్నారు.

అందని ద్రాక్షగా ఆయుర్వేద వైద్యం

- చందోలు ఆస్పత్రిలో సిబ్బంది కరవు
- డెప్యుటేషన్‌పై నగరం వెళ్లిన వైద్యురాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు

పిట్టలవానిపాలెం: ఎంతో చరిత్ర గల ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్యసేవలు నిలిచి పోవడంతో చందోలుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. పిట్టలవానిపాలెం మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన చందోలులో స్వాతంత్ర్యం అనంతరం ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేశారు. 10 వేలకు పైగా జనాభా కలిగిన గ్రామంలో పలువురు ఆయుర్వేద వైద్యంపై ఆధారపడి ఉన్నారు. అయితే, కొంతకాలంగా సేవలు నిలిచిపోయాయి. వాస్తవానికి ఆస్పత్రిలో వైద్యుడితో పాటు ఏఎన్ఎం, కాపౌండర్, అటెండర్ విధులు నిర్వహించాలి. వైద్యురాలిని నగరం మండలం, అటెండర్‌ను జంపని ఆయుర్వేద వైద్యశాలకు డెప్యుటేషన్‌పై పంపించారు.దీంతో ఏఎన్ఎం మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో ఔషధాలు అందుబాటులో ఉన్నప్పటికీ వైద్యులు లేకపోవడంతో ఏఎన్ఎం మాత్రమే తనకు తెలిసిన వైద్యం చేస్తూ ఔషధాలను ఇచ్చి పంపిస్తున్నారు. దీంతో రోగులు నిరాశతో వెనుదిరిగి వెళుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైద్యశాలలో డాక్టర్‌ని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుని సీటు


విధుల్లో ఉన్న ఏఎన్ఎం

వెంటనే డాక్టర్‌ను నియమించాలి



ఎప్పటి నుంచో మా గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నడుస్తోంది. సిబ్బందిని ఇక్కడ నుంచి ఎందుకు పంపారో అర్థం కావడం లేదు. వైద్యులు లేకపోవడంతో స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి డాక్టర్‌ను నియమించాలి.

–జునైద్, గ్రామస్తుడు

డాక్టర్ లేక ఇబ్బంది



ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్ లేకపోవడం బాధాకరం. మేజర్ గ్రామ పంచాయతీ నుంచి వేరొక చోటకు డెప్యుటేషన్‌పై పంపించడం సబబుగా లేదు. ఇక్కడ డాక్టర్ లేకపోవడంతో రోగులు నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు.

– చేబ్రోలు వీరయ్య గ్రామ ఉప సర్పంచ్

తెనాలి చేరిన రవితేజ మృతదేహం

ఈనెల 18న అమెరికాలో మృతి

తెనాలిరూరల్: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందిన గుంటూరు జిల్లా తెనాలి ఐతానగర్‌కు చెందిన తాడిబోయిన రవితేజ భౌతికకాయం శుక్రవారం సాయంత్రం తెనాలి చేరుకుంది. అమెరికా నుంచి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న భౌతికకాయాన్ని అంబులెన్స్ ద్వారా తెనాలి తీసుకు వచ్చారు. ఈ నెల 18న అమెరికాలోని టెక్సాస్‌లో ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి రవితేజ మృతి చెందిన విషయం తెలిసిందే. అతడి తండ్రి గతంలోనే మృతి చెందగా తల్లి జయలక్ష్మి కొడుకుకు మంచి చదువు చెప్పించి పెంచి పెద్ద చేసింది. ఓవైపు చదువుకుంటూనే కోకోకోలా కంపెనీలో ఉద్యోగం చేస్తూ డబ్బులు కూడపెట్టుకున్న రవితేజ ఎంఎస్ కోసం గత ఏడాది ఆగస్టులో అమెరికా వెళ్లాడు. అక్కడ టెక్సాస్‌లో ట్రైన్ యూనివర్సిటీలో ఎంఎస్ చేస్తూ పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 18న స్నేహితులతో కలిసి అక్కడ స్విమ్మింగ్‌పూల్‌లో దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దాదాపు ఎనిమిది రోజుల అనంతరం శుక్రవారం సాయంత్రం భౌతికకాయం తెనాలి చేరుకుంది. భారీ ఊరేగింపుగా ఐతానగర్‌లోని నివాసానికి తీసుకువెళ్లారు. రజక చెరువు సెంటర్ నుంచి లింగారావు సెంటర్ మీదుగా నివాసానికి రాత్రికి చేరుకుంది. రవితేజ భౌతికకాయాన్ని చూసి తల్లి జయలక్ష్మి, సోదరుడు కన్నీటి పర్యంతమయ్యారు. పేద కుటుంబానికి చెందిన తాము కొడుకు ప్రయోజకుడవుతాడని అమెరికా పంపిస్తే అనుకోని ప్రమాదంలో మృతి చెందాడంటూ మృతదేహాన్ని చూసి తల్లి జయలక్ష్మి గుండెల విసేలా రోదించారు. శనివారం ఉదయం రవితేజ భౌతికకాయానికి అంత్యక్రియలు జరగనున్నాయి.


తెనాలి ఐతానగర్ ఇంట్లో ఉంచిన రవితేజ మృతదేహం

ప్రకృతి సేద్యం పెరగాలి

ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం అధికారి గోపి

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో ఈ ఏడాది ప్రకృతి సేద్యాన్ని పెంచే దిశగా విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం అధికారి గోపి సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రకృతి సేద్యం విశిష్టతను వివరించారు. రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం గుంటూరు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని తెలిపారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ప్రకృతి సేద్యం గురించి సూచనలు, సలహాలను ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం అధికారి సత్యనారాయణ, ఎన్ఎఫ్ఏలు, క్షేత్ర స్థాయి ఎంటీలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, మోడల్ మేకర్లు, డిజిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం అధికారి గోపి